క్లుప్తంగా

నిరుపేద విద్యార్థులకు ట్రస్ట్ చేయూత



విద్యార్థులకు ఫీజు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం కోరింత కుంట తండాకు చెందిన నిరుపేద విద్యార్థులు చరణ్‌నాయక్, చింటు, కల్వకుర్తి మండలం తిమ్మరాసిపల్లి వాసి ప్రశాంత్ చదువులకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ అండగా నిలిచారు. 9వ తరగతి చరణ్‌నాయక్, ప్రశాంత్, 10వ తరగతి చింటుల పాఠశాల ఫీజును గురువారం ట్రస్టు అందచేసింది.

డ్రైవర్ కుటుంబానికి అసోసియేషన్ సాయం

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన ప్రైవేట్ వాహన డ్రైవర్ నార్లకంటి మల్లేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని గురువారం భ్రమరాంబ మల్లికార్జున స్వామి డ్రైవర్స్ అసోసియేషన్ సభ్యులు పరామర్శించారు. రూ.15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రమేశ్, సత్యం, మహేశ్, రవి, శ్రీనివాస్, జంగయ్య, మల్లేశ్, రాఘవేందర్, కృష్ణ, మోత్యా, నాగులు, రాములు, రామస్వామి తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



బాధిత కుటుంబానికి సహాయం అందజేస్తున్న సంఘం నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణానికి చెందిన నారమోని మల్లేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. గురువారం శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.1.05 లక్షలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ వైస్ చైర్మన్, సంఘం అధ్యక్షుడు తోట గిరియాదవ్, మాజీ కౌన్సిలర్ శ్రీశైలం యాదవ్, నాయకులు ముక్కెరి కృష్ణయ్య, వెంకటేశ్, శ్రీనివాస్, జనిగల గిరియాదవ్, తోట శ్రీను తదితరులు ఉన్నారు.

విరిగిన స్తంభం తొలగించాలి



ఏడీకి వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నేతలు

ఇబ్రహీంపట్నం: కొంగరకలాన్ కలెక్టరేట్ ఎదురుగా ఫాక్స్ కంపెనీకి వెళ్లే మార్గంలో విరిగిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి, దాని స్థానంలో కొత్తది అమర్చాలని బీఎస్పీ నేతలు కోరారు. ఈ మేరకు గురువారం ఇబ్రహీంపట్నం ఏడీ సీతారాంకు వినతిపత్రం అందజేశారు. ఈ దారిలో అనేక వాహనాలు, ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారని, ఏదైనా ప్రమాదం జరగకముందే పోల్‌ను తొలగించాలని విన్నవించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మహేందర్, కరుణాకర్, రాజు, భాస్కర్ తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



మొక్కలు నాటుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఆమనగల్లు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అర్జున్‌రావ్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలో పార్టీ ఆధ్వర్యంలో గురువారం వన మహోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షించుకుంటే సకాలంలో వర్షాలు కురుస్తాయని, కరువు కాటకాలు ఉండవన్నారు. జీవి మనుగడకు మొక్కలు దోహదపడతాయని తెలిపారు. బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్, మాజీ ఎంపీటీసీ పంతునాయక్, మాజీ కౌన్సిలర్ వెంకటయ్య, మాజీ సర్పంచ్ శ్రీనునాయక్, నాయకులు వెంకటేశ్, వెంకటయ్య, పరమేశ్, కేశవులు, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రులకు జీవన భరోసా

మత్స్యకారులకు మంచి రోజులు రానున్నాయి. ఇప్పటి వరకు రహదారులు, వీధుల్లో చేపలు విక్రయించే గంగపుత్రులకు.. ఇబ్రహీంపట్నంలో మోడల్ ఫిష్ మార్కెట్ నిర్మాణంతో సంచార జీవనం నుంచి విముక్తి లభించనుంది. జీవన భరోసా దక్కనుంది.

పట్నంలో.. మోడల్ ఫిష్ మార్కెట్
- రూ.2 కోట్లతో త్వరలో నిర్మాణ పనులు ప్రారంభం
- శేరిగూడ చేపపిల్లల ఉత్పత్తి కేంద్రంలోనే విపణి
- గంపగుత్తగా చేపల క్రయవిక్రయాలు





మార్కెట్ నిర్మాణం చేసేది ఇక్కడే (ఇన్‌సెట్‌లో) శేరిగూడలో మార్కెట్ కోసం వేసిన శిలాఫలకం

ఇబ్రహీంపట్నం రూరల్: రంగారెడ్డి జిల్లాలోనే అతి పెద్ద చెరువు ఇబ్రహీంపట్నం చెరువు. ఈ చెరువు పక్క నుంచే రహదారి ఉండటంతో దీనికి ప్రాధాన్యత సంతరించుకుంది. నాగార్జునసాగర్ రోడ్డు వయా హైదరాబాద్‌కు ఉండటం వలన ఇక్కడ చేపల మార్కెట్ ఏర్పాటు చేయాలని మత్స్యకారులు సుదీర్ఘ కాలంగా పోరాటం చేశారు. దాని ఫలితంగానే అత్యాధునిక విపణి ఏర్పాటుకు బీజం పడింది.

డైరెక్టర్ల మార్పుతో జాప్యం

గంగపుత్రుల కోరిక మేరకు గత ప్రభుత్వం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కేంద్రంలో హోల్‌సేల్ మోడల్ చేపల మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అందుకు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద రూ.2 కోట్లను కేటాయించింది. 2023 ఆగస్టు 26న భూమి పూజ చేసింది. కానీ నిధులు మాత్రం మంజూరు కాలేదు. ఈ లోపే ప్రభుత్వం మారడంతో మార్కెట్ నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది. తదనంతరం కొలువుదీరిన కాంగ్రెస్ సర్కార్.. మార్కెట్ నిర్మాణానికి అనుమతి ఇచ్చింది. నిధులు కేటాయించింది. అంతా బాగుంది అనుకునే లోపే.. మత్స్యశాఖలో డైరెక్టర్లు మారడంతో కాస్త జాప్యం జరిగినట్లు తెలుస్తోంది. డీపీఆర్ ప్రకారం మత్స్యకారుల హోల్‌సేల్, రీటైల్ మార్కెట్ నిర్మాణం పనులు ప్రారంభం కావాలి. స్టాల్స్, హోల్‌సేల్ మార్కెట్ వసతి, చేపలు నిల్వ చేయడానికి ఐస్ కంపెనీలు, స్టోరేజి గోదాములతో పాటు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంటుంది. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చొరవతో పనుల్లో వేగం పెరిగినట్లు సమాచారం.

మత్స్య సంపద పుష్కలం

ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులో మత్స్య సంపద పుష్కలంగా ఉంది. ఒక్క సారి చెరువు నిండితే ఏళ్లుగా మత్స్యకారులకు ప్రయోజనం చేకూరుతుంది. నియోజవకర్గంలో 80కి పైగా మత్స్య సహకార సంఘాలు ఉండగా.. వాటిలో 5వేలకు పైగా గంగపుత్రులు ఉన్నారు. వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. చెరువు వద్దే మార్కెట్ వసతి కల్పించడం వలన.. వీరి జీవనోపాధి మెరుగు పడడంతో పాటు.. మాంసాహార ప్రియులకు తాజా చేపలు లభిస్తాయి. మీనం ధరలు కూడా అందుబాటులో ఉంటాయి. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మేలు చేకూరుతుంది.

పనులు ప్రారంభించాలి



ఇబ్రహీంపట్నంలో చేపల మార్కెట్ ఏర్పాటు చేయాలని 20 ఏళ్లుగా పోరాటం చేశాము. దాని ఫలితంగానే శేరిగూడ చేపల ఉత్పత్తి కేంద్రంలోనే మార్కెట్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. మార్కెట్ నిర్మాణం కోసం ఉత్పత్తి కేంద్రాన్ని కూల్చివేశారు. నిర్మాణ పనులు చేపట్టాలి. దాంతో పాటే.. ఉత్పత్తి కేంద్రాన్ని కాపాడాలి.

– చెనమోని శంకర్, మత్స్యకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి

అధికారుల బదిలీతో జాప్యం

మత్స్యశాఖలో అధికారులు బదిలీలు జరిగాయి. కొత్త అధికారులు వచ్చారు. మార్కెట్ నిర్మాణం గురించి అందరికీ అవగాహన ఉన్నప్పటికీ.. కొంత జాప్యం జరిగింది. మార్కెట్ నిర్మాణం వారి దృష్టికి తీసుకెళ్లి, పనులు ప్రారంభించే విధంగా చూస్తాం. అన్ని రకాల అనుమతులు వచ్చాయి. పనులు ఏ సమయంలోనైనా ప్రారంభం కావొచ్చు.

– పూర్ణిమ, డీఎఫ్ఓ, రంగారెడ్డి

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

- నాణ్యమైన సరఫరాకు ఎన్నినిధులైనా వెచ్చిస్తాం
- ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టాలి
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ఎన్ని నిధులైనా వెచ్చిస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సమస్యలు తలెత్తకుండా, సరఫరాకు ఆటంకం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కల్వకుర్తి పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం విద్యుత్, రెవెన్యూ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. విద్యుత్ సమస్యల గురించి ఆరాతీశారు. రెవెన్యూ సదస్సుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు రాకుండా నూతనంగా 8 సబ్ స్టేషన్లు నిర్మిస్తున్నామని, సుమారు 650 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఇళ్లపై ఉన్న కరెంటు తీగలు, పాతబడిన లైన్లను మార్చడానికి నిధులు మంజూరు చేశామని తెలిపారు. ప్రజలు, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అధికారులు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో విద్యుత్ డీఈలు గోపాల్, శ్రీధర్‌శెట్టి, ఏడీఈ బాలకృష్ణ, శంకరయ్య, తహసీల్దార్లు లలిత, నాగార్జున, వినయ్‌సాగర్, ముంతాజ్, కార్తీక్, ఇబ్రహీం, సునీత, పీసీసీ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, పీసీబీ మాజీ సభ్యుడు బాలాజీసింగ్, మార్కెట్ చైర్‌పర్సన్ గీత, మాజీ చైర్మన్ కిషన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, విజయ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, ప్రభాకర్‌రెడ్డి, బిచ్యానాయక్, మోతీలాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు నడిపిన ఎమ్మెల్యే..

కల్వకుర్తి నుంచి గట్టుప్పలపల్లి, రాంపూర్ మీదుగా తలకొండపల్లి వరకు నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సును ఎమ్మెల్యే కసిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కల్వకుర్తి బస్టాండ్ నుంచి క్యాంపు కార్యాలయం వరకు ఎమ్మెల్యే బస్సును నడిపారు.

విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న వెంకటేశ్

- ప్రాథమిక విద్యతోనే భవితకు పునాది
- విద్యా కమిషన్ సభ్యుడు వెంకటేశ్

కడ్తాల్: విద్యారంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని, అందులో భాగంగా విద్యా వ్యవస్థలో మార్పులు తెచ్చేందుకు చర్యలు తీసుకుంటుందని విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులతో సమావేశమై విద్య, విద్యార్థుల సమగ్రాభివృద్ధి, వసతులు, బడిబాట తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం అరుణ పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు పాఠశాల సమయానికి బస్సు సౌకర్యం ఉండాలని, రవాణా సౌకర్యం లేని వారికి ప్రత్యేక వాహన సదుపాయం కల్పించాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల నియామకంతో పాటు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇచ్చిందని తెలిపారు. దీంతో పాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం, స్కిల్స్ డెవలప్‌మెంట్ యూనివర్శిటీలు తదితర కార్యక్రమాలను చేపట్టిందని వివరించారు. ప్రాథమిక దశలో అందే విద్యతోనే పునాది బలపడుతుందని, తద్వారా విద్యార్థులు ఉన్నత విద్యలో మెరుగ్గా రాణించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో హెచ్‌ఎం అరుణ, నాయకులు ఆసిఫ్‌అలీ, సుధాకర్‌గౌడ్, సత్యం, విజయ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

దుకాణ సముదాయం ప్రారంభించాలి

కడ్తాల్: పాలశీతలీకరణ కేంద్రం ఆవరణలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను వెంటనే ప్రారంభించాలని విజయపాల కేంద్రం అధ్యక్షుడు చేగూరి వెంకటేశ్ కోరారు. గురువారం మండల కేంద్రంలోని చిల్లింగ్ సెంటర్ సందర్శనకు వచ్చిన టీజీడీడీసీఎఫ్ చీఫ్ క్వాలిటీ కంట్రోలర్ కవిత, డీడీ మోహన్ మురళీకి విన్నవించారు. టెండర్లు నిర్వహించి నెలలు కావొస్తున్నా.. ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. వినియోగంలోకి తేకపోవడం వలన పాలకేంద్రం ఆదాయం కోల్పోతుందని, వెంటనే ప్రారంభించాలని కోరారు. అనంతరం వివిధ పాలకేంద్రాల అధ్యక్షులు, వేతన కార్యదర్శులు వారిని సన్మానించారు. కార్యక్రమంలో పశు సంవర్థక శాఖ జేడీ బాబు బేరి, పాలకేంద్రం ఇన్‌చార్జి మేనేజర్ ఉదయశ్రీ, విజయ డెయిరీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వ్యాస రచన పోటీలు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 'స్వచ్ఛత' అనే అంశంపై వ్యాస రచన పోటీలను గురువారం నిర్వహించారు. మున్సిపాలిటీ వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఈ పోటీలను అధికారులు ఏర్పాటు చేశారు.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సమస్యల పరిష్కారమే లక్ష్యం

తహసీల్దార్ సైదులు

మహేశ్వరం: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం రైతు సదస్సులను నిర్వహిస్తోందని తహసీల్దార్ సైదులు అన్నారు. గురువారం మండల పరిధిలోని దిలావార్‌గూడ, దుబ్బచర్ల గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి చట్టంలో భాగంగా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించి రైతుల సమస్యలపై దరఖాస్తులను స్వీకరించి వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. దిలావార్‌గూడలో–7 దరఖాస్తులు, దుబ్బచర్లలో–27 దరఖాస్తులు వచ్చాయని రెవెన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నవత, సీనియర్ అసిస్టెంట్ పావని, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు స్వర్ణకుమారి, ప్రేమ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

బీటీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: మండలంలోని బాటసింగారం గ్రామం శివాజీ విగ్రహం నుంచి కొత్తగూడెం కూడలి వరకు రూ.2.20 కోట్ల హెచ్‌ఎండీఏ నిధులతో నిర్మించనున్న బీటీరోడ్డు నిర్మాణ పనులకు గురువారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా కేక్‌కట్ చేశారు. అదే విధంగా గ్రామంలోని శ్రీ వాసవీ సాయి శ్రీనివాస దేవాలయం 3వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దాసుగౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటేశ్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

వాసవీ కన్యాకా పరమేశ్వరి ఆలయ నిర్మాణానికి ఓ భక్తుడు భారీగా విరాళం అందజేశారు. గురువారం మాజీ ఎంపీటీసీ కేశెట్టి వెంకటేశ్.. రూ.3 లక్షల చెక్కును విరాళంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతులమీదుగా బాటసింగారం శ్రీ వాసవీ శ్రీనివాస ట్రస్ట్‌కు అందజేశారు.

సహకార సంఘాన్ని సందర్శించిన కార్యదర్శులు



సెక్రటరీ బృందంతో కొత్తకుర్మ సత్తయ్య

తుర్కయంజాల్: సహకార విద్య, శిక్షణ, ఇంటిగ్రేటెడ్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని పీఏసీఎస్ సెక్రటరీల బృందం గురువారం తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సంఘం చైర్మన్, టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం సంఘం చేపడుతున్న అభివృద్ధి పనులు, రైతులకు, సంఘం సభ్యులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. బీఎన్ రెడ్డి నగర్‌లోని బ్రాంచి, కొహెడలోని గోదాములను పరిశీలించారు. కార్యక్రమంలో సీటీఐ ఫ్యాకల్టి జి.ఈశ్వర్ రావు, సీఈఓ వై.రాందాసు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఆరోపణలు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని అధికార పార్టీ మండల అధ్యక్షుడు జగన్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు రైతుభరోసా నిధులు అందిస్తుందని చెప్పారు. దీనిని చూసి ఓర్వలేని బీఆర్ఎస్ నాయకులు.. ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, వాటిని మానుకోకపోతే.. ప్రజలే ఆ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు రాములు, పట్టణ అధ్యక్షుడు మానయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీశైలం, నాయకులు ఖలీల్, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, అలీం, ఫరీద్, శేఖర్‌గౌడ్, మహేశ్, హరిలాల్, కుమార్‌గౌడ్, రఫి తదితరులు ఉన్నారు.

నమస్తే ప్రాజెక్ట్‌పై అవగాహన

మీర్‌పేట: వంద రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం మీర్‌పేట మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నమస్తే ప్రాజెక్ట్ కార్యక్రమాన్ని కమిషనర్ జ్ఞానేశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆటో డ్రైవర్లు, హెల్పర్స్, స్క్రాబ్ షాపు డీలర్స్, పారిశుద్ధ్య సిబ్బందికి ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డులు, ఈ–శ్రామ్ కార్డుల జారీతో పాటు పీపీఈ కిట్స్, శానిటేషన్ యంత్రాల కొనుగోలు, సబ్సిడీ రుణాలపై కమిషనర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మేనేజర్ చంద్రప్రకాశ్‌రెడ్డి, ఆర్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, నమస్తే ప్రోగ్రాం రాష్ట్ర కో–ఆర్డినేటర్ పి.యోగేశ్, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ చిన్నికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కమిషనర్ జ్ఞానేశ్వర్

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

మండల విద్యాధికారి హీర్యానాయక్

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి హీర్యానాయక్ అన్నారు. గురువారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి కొంగర కలాన్ తండా ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎల్.విజయ్‌కాంత్ ఆధ్వర్యంలో బడిబాట ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం.. తన సొంత ఖర్చులతో 32 మంది విద్యార్థులకు ఉచితంగా నోటుపుస్తకాలు, స్టేషనరీ, మధ్యాహ్న భోజనం సిబ్బందికి గ్యాస్ స్టౌవ్ అందజేశారు. అనంతరం హెచ్‌ఎంను విద్యాధికారి అభినందించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు వర్కాల పరమేష్, ఉపాధ్యాయుడు ధర్మారెడ్డి, వంట సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా పోటీలు

బడిబాట ముగింపు సందర్భంగా ఆదిబట్ల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులతో పాటు ఆదిబట్ల బడిబాట ఛాంపియన్ కిరీటం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మీదేవి, భాషయ్య, శైలజ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఇబ్రహీంపట్నం: శుక్రవారం మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటనర్సప్ప గురువారం తెలిపారు. డిపో పరిసర ప్రాంతాల్లోని ప్రజలు.. సమస్యలతో పాటు.. విలువైన సూచనలు, సలహాలను 9959226241 నంబర్‌కు తెలియజేయాలని సూచించారు. డిపో అభివృద్ధికి సహకరించాలని కోరారు.

పాఠశాల ఆవరణలో టాయిలెట్ల నిర్మాణం

అబ్దుల్లాపూర్‌మెట్: మజీద్‌పూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థుల కోసం రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అధునాతన టాయిలెట్లను నిర్మించింది. గురువారం క్లబ్ ప్రతినిధులు టాయిలెట్లను వినియోగంలోకి తేచ్చారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్‌రెడ్డి వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు గోవింద్ అగర్వాల్, పరాగ్ షా, విజయ్‌సారథి, రాంరాజ్, అనీల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

ఇబ్రహీంపట్నం రూరల్: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జూలై 9న చేపట్టబోయే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ ఆదిబట్ల మున్సిపాలిటీ కార్యదర్శి నర్సింహ పిలుపునిచ్చారు. గురువారం మున్సిపల్ కార్మికులతో కలిసి కమిషనర్ బాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ విధానం రద్దు చేసి.. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు.



కడ్తాల్: కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు

ఘనంగా రాహుల్‌గాంధీ పుట్టినరోజు

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ పుట్టిన రోజును పురస్కరించుకుని గురువారం ఆ పార్టీ శ్రేణులు ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు తదితర ప్రాంతాల్లో సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కేకులు కట్ చేశారు. ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు. – సాక్షి, నెట్‌వర్క్



ఇబ్రహీంపట్నం: వినోభానగర్‌లో.. అంధులకు పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నేతలు



ఆమనగల్లులో..



తుర్కయంజాల్‌లో..